శ్రీకాళహస్తిలో అభివృద్ధి పరుగులు

- ప్రజలకు అండగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- ప్రచారంలో బియ్యపు శ్రీవాణి రెడ్డి



ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డికి ఆత్మీయ స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రేణిగుంట: శ్రీకాళహస్తి నియోజవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఐదేళ్లలో 30 ఏళ్ల అభివృద్ధిని పరుగులు పెట్టించారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణి రెడ్డి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుధవారం తొట్టంబేడు మండలం చిట్టత్తూరు, లక్ష్మీపురం, కొత్తకండ్రిగ, శాంతిపురం గ్రామాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమెకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. సొంత నిధులతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల్లో నిత్యం ఉండే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బొజ్జల కుటుంబానికి ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలు గుర్తుకు వస్తారని ఆరోపించారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని శ్రీవాణి రెడ్డి తెలిపారు.

జగనన్న ప్రభుత్వంలో అందరికీ మేలు

జగనన్న ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరిగిందని శ్రీవాణిరెడ్డి తెలిపారు. కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు నేరుగా వారి ఇంటికే చేరాయని పేర్కొన్నారు. నవరత్నాలతో ప్రజల్లో జీవితాల్లో జగనన్న వెలుగులు నింపారని, రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ ఉన్నం నిర్మల, సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు శైలజ, అల్లయ్య, చెంచురాఘవరెడ్డి, రఘు, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గిరిరెడ్డి, హరి, గురునాథం, మునిశేఖర్, సురేష్‌రెడ్డి, హరిరెడ్డి, రాంబాబు, రామచంద్రయ్య, సీఎసీఎస్ చైర్మన్ మణినాయుడు, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, వెంకటరమణారెడ్డి, కోవి చంద్రయ్యనాయుడు, వెంకీ, భాస్కర్‌రెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో శ్రీవాణిరెడ్డి

రెండు వర్గాలైన జనసేన

శ్రీకాళహస్తి: సోషల్ మీడియా వేదికగా జనసేన నాయకులు రెండు వర్గాలు వీడి మాటల యుద్ధానికి దిగారు. ఒక వర్గం టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డికి మద్దతు తెలపాలని, మరో వర్గం జనసేన నాయకురాలు కోట వినుతకు టిక్కెట్ వచ్చే వరకు అధిష్టానంతో పోరాటం చేయాలని మాటల యుద్ధం సాగిస్తున్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి ఉమ్మడి అభ్యర్థి అని, ఆయనను గెలిపించాలని జనసేన నాయకుడు అంజూరు చక్రధర్ కోరుతున్నాడు. దీనిపై వినుత వర్గం మండిపడుతూ చక్రధర్ టీడీపీ కోవర్టుగా వ్యవహరిస్తున్నాడని, జనసేనలో పదవి పొంది టీడీపీకి ఊడిగం చేయడం మంచిదికాదంటున్నారు. వినుత ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాల కోసం సొంత డబ్బు ఖర్చు చేశారని, చక్రధర్‌లాంటి వారు ఆమె ద్వారా పదవులు పొంది నేడు వ్యతిరేకంగా పనిచేయడం మంచిది కాదని పేర్కొంటున్నారు. మరోసారి కించపరిచేలా వ్యవహరిస్తే ఖబడ్దార్ అని మాటల యుద్ధం కొనసాగిస్తున్నారు.

పశువుల పెంపకంపై అవగాహన

ఏర్పేడు: తిరుపతి శ్రీవేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలో పశువుల పెంపకం, వాటి నిర్వహణపై మండలంలోని మహిళా రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని నాగంపల్లి సమీపంలో ఉన్న ఎస్‌ఓఎస్ బాలల గ్రామం కోఆర్డినేటర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో 60 మంది మహిళా రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు.

క్లుప్తంగా

వంద శాతం ఇంటి పన్ను వసూలు



పన్ను వసూలు చేస్తున్న ఇందిరమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరులో వంద శాతం ఇంటి పన్నులు వసూలు అయినట్లు గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ తెలిపారు. ఆమె బుధవారం గ్రామ సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణలపై దృష్టి పెట్టి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తాను సంపద కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసి ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామస్తులు గ్రామాభివృద్ధి కోసం సకాలంలో ఇంటి పన్నులను చెల్లించడం సంతోషంగా ఉందని తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



సూచనలిస్తున్న డైరెక్టర్ త్యాగరాజు

బుచ్చినాయుడుకండ్రిగ: డెంగీ, మలేరియా, చికున్ గున్యా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా యూనిట్ కడప జోనల్ జాయింట్ డైరెక్టర్ త్యాగరాజు తెలిపారు. ఆయన బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ పీహెచ్‌సీని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలు రాకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలు వాడాలని, ఇంటి ద్వారాలకు, కిటికీలకు మెష్‌లు బిగించాలని తెలిపారు. ప్రజలకు జ్వరాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారి మాధవి, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు జ్వరాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదుగురు చికిత్స పొందారు. విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నా ప్రిన్సిపల్ పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. జ్వరాలు తగ్గే వరకు గురుకులంలో వైద్యుడిని నియమించి, చికిత్సలు అందించాలని కోరుతున్నారు. దోమకాటు కారణంగా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నట్లు వైద్యాధికారి మాధవి తెలిపారు.

పంచాయతీకి రూ.15,86,400 ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ ప్రభురెడ్డి

నాగలాపురం: వివిధ నిర్వహణల వేలం ద్వారా పంచాయతీకి బుధవారం రూ.15,86,400 ఆదాయం లభించినట్లు డీఎల్‌పీవో ప్రభురెడ్డి తెలిపారు. సర్పంచ్ చిన్నదొరై సుధా అధ్యక్షతన 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 1వ తేదీ వరకు ఏడాది కాలపరిమితికి సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ వారపు సంత వేలం ద్వారా రూ.1,75,000, దినసరి కూరగాయల మార్కెట్ రూ.1,15,000, ప్రైవేటు బస్టాండ్ రూ.1,53,000, జంతు వేధశాల రూ.49,000, 33 దుకాణాల ద్వారా రూ.10,94,400 పంచాయతీకి ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యదర్శి నాగరత్నమ్మ, ఈఓపీఆర్డీ శైలేంద్ర, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ సునీత పాల్గొన్నారు.

మద్యం విక్రేతపై కేసు నమోదు

శ్రీకాళహస్తి : మండలంలోని చుక్కలనిడిగల్లు పంచాయతీ పరిధిలో బుధవారం మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఓ మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం.. చుక్కలనిడిగల్లుకు చెందిన పోలమ్మ(45) గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఆమె వద్ద తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

కనుల పండువగా ఊంజల్ సేవ



ఊయలలో సేద తీరుతున్న అమ్మవారు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం అమ్మవారు ఊంజల్‌సేవలో భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతసేవతో నిత్య పూజా కైంకర్యాలు పూర్తి చేశారు. గంట, నైవేద్యం అనంతరం శ్రీపద్మావతీ అమ్మవారికి సర్కారు అభిషేకాన్ని నిర్వహించారు. సాయంత్రం కైంకర్యాల పూర్తి అయిన తర్వాత అమ్మవారిని పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధ పుష్ప మాలికలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింప చేశారు. ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఊయలలో కొలువుదీరారు. తదుపరి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణ నడుమ ఊయలలో సేద తీరుతున్న అమ్మవారిని దర్శించి భక్తులు తరించారు. తీర్థప్రసాదాలను అందజేశారు. సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పంగుణోత్సవాల సందర్భంగా ఉంజల్ మండపాన్ని కలంకారీ వస్త్రాలతో, పుష్ప తోరణాలతో విశేషంగా అలంకరించారు.

సత్యవేడుకు అమరనాథ్‌రెడ్డి బైక్ యాత్ర

సత్యవేడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని కోరుతూ కడప నుంచి ఇచ్ఛాపురం వరకు బైక్ ప్రచార యాత్ర కొనసాగిస్తున్న అభిమాని అమర్నాథ్ రెడ్డి బుధవారం సత్యవేడుకు చేరుకున్నారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ అభ్యర్థి నూకతోటి రాజేష్ ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. తొలుత ఎంపీపీ వి.ప్రతిమ ఇంటి వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన కొనసాగిస్తున్న యాత్ర దిగ్విజయంగా సాగాలని నాయకులు ఆకాంక్షించారు. పార్టీ తాడిపత్రి పరిశీలకుడు బీరేంద్రవర్మ, మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ నిరంజన్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రఘుపతిరెడ్డి, పగడాల రమేష్, కోఆప్షన్ మెంబరు మస్తానీ, సోము తదితరులు పాల్గొన్నారు.



అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న రాజేష్, నాయకులు

కండలేరును సందర్శించిన ట్రైనీ కలెక్టర్

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయాన్ని ట్రైనీ కలెక్టర్ సంజన సింహ బుధవారం సందర్శించారు. జలాశయం నిర్మాణం, నీటి సామర్థ్యం వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రైనీ కలెక్టర్‌కు ఎస్‌ఈ రామిరెడ్డి కండలేరు జలాశయం గురించి వివరించారు. డీఈలు విజయరామిరెడ్డి, నాగేశ్వరావు, ఏఈ తిరుమలయ్య ఉన్నారు.

సేంద్రియ సాగుతో ఆరోగ్యకర దిగుబడులు

రేణిగుంట: సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన దిగుబడులను అందించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షణ నిర్వాహకురాలు నీలిమ అన్నారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో ఉన్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు రెండురోజుల శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, విధానాలు, అందులో వినియోగించే వివిధ రకాల కషాయాల తయారీ, వాడకంపై ఆమె అవగాహన కల్పించారు. ఆమె మట్లాడుతూ రైతులు పంటలకు విచ్చలవిడిగా రసాయన మందులను వాడడం వల్ల ఆహార ఉత్పత్తులు కలుషితమవుతున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయంతో సాగుబడి ఖర్చు తగ్గి, నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చని వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు పద్మజ, దివ్య, రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న నీలిమ

మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను విజయవంతం చేద్దాం



పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి రాజేష్

నాగలాపురం: మండలంలో ఈనెల 22వ తేదీన జరగనున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూక తోటి రాజేష్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని టీఆర్‌ఆర్ కల్యాణమండపంలో పార్టీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై పార్టీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధాతో చర్చించారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ కార్మిక విభాగం జిల్లా నాయకుడు బీరేంద్ర వర్మ, జెడ్పీటీసీ సభ్యుడు మహేష్ రెడ్డి, నాయకులు శ్యామ్, కులశేఖర్, చిరంజీవి, ఉదయ్ కుమార్ దేశప్పన్, దేశన్, ధనరాజ్, ఎల్.సురేష్ ఏలుమలై తదితరులు పాల్గొన్నారు.

కోలా ఆనంద్‌కు మద్దతుగా బీజేపీ ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే టిక్కెట్టు వస్తుందని ఆ పార్టీ నాయకులు బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో బీజేపీ అభ్యున్నతికి కోలా ఆనంద్ ఎంతగానో కృషి చేశారన్నారు. నాయకులు మేశాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇప్పటికే శ్రీకాళహస్తి అసెంబ్లీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ బొజ్జల సుధీర్‌ను ప్రకటించగా, బీజేపీ తరఫున కోలా ఆనంద్, జనసేన తరఫున టికెట్ కోసం వినూత ఇంకా ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కలువాయి: కుల్లూరులోని శ్రీదేవీ భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమానికి మాజీ శాసన మండలి సభ్యులు మాదాసు గంగాధరం, నళినమ్మ, మాదాసు యజ్ఞపవన్, అపర్ణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవదేవేరులకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం స్వామి వారికి అగ్ని ప్రతిష్టాపన, శాంతి హోమం, పంచామృతాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఇరు దేవేరులకు కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న డీఎఫ్‌ఓ శామ్యూల్

సూళ్లూరుపేట: ఒకప్పుడు గ్రామాల్లో పిచ్చుకలు విరివిగా వుండేవని, ఈ రోజున ఆ పిచ్చుకలు అంతరించి పోవడానికి మనుషులే కారణమని సూళ్లూరుపేట వన్యప్రాణి సంరక్షణ విభాగం డీఎఫ్‌ఓ పి.శామ్యూల్ అన్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎకో క్లబ్, జంతుశాస్త్రం, పులికాట్ వన్యప్రాణి సంరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అటకానితిప్పలోని పర్యావరణ విజ్ఞానకేంద్రంలో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అటకానితిప్ప వద్ద అంతరించి పోతున్న పక్షుల జాతులను కాపాడుకోవాలని ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా అక్కడ జరిగిన వన్యప్రాణి సంరక్షణ విభాగం డీఎఫ్‌ఓ శామ్యూల్ ప్రసంగిస్తూ అనంత విశ్వంలో ప్రతి జీవి విలువైనదేనని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని తెలిపారు. ప్రకృతిలో మనిషి జీవనానికి ప్రమాదకరమైన క్రూర జంతువులు, విష సర్పాలు వలన కూడా మానవులకు మేలు జరుగుతుందనే విషయాన్ని మరిచిపోయి వాటిని చంపుతుంటామని అన్నా రు. పిచ్చుకల విషయానికొస్తే ఒకప్పుడు పిచ్చుకలకు ఆహారాన్ని అందించేందుకు వరి వెన్నులను ఇంట్లో కట్టేవారు. నేడు మనిషి ఆధునిక జీవన విధానానికి అలవాటు పడిపోయి మన చుట్టూ వున్న కొన్ని పక్షులు కనుమరుగైపోతున్నాయని అన్నారు. ఉన్న వాటినైనా మనమంతా రక్షించుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ పిచ్చుకల సంఖ్య తగ్గిపోవడానికి కారణం పంటలకు క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువుల వాడకం పెరగడమేనని తెలిపారు. నానాటికీ పెరుగుతున్న సెల్‌టవర్ల రేడియేషన్ కూడా మరో ముఖ్య కారణమని పేర్కొన్నారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ బి.రాజేంద్రప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఓ. ప్రకాష్‌రావు, డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ పి.ఏడుకొండలు పాల్గొన్నారు.

మహిళపై దాడి ఐదుగురిపై కేసు

ఏర్పేడు: మండలంలోని కోబాకమిట్ట గ్రామంలో ఓ మహిళపై జరిగిన దాడి ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు బుధవారం రాత్రి తెలిపారు. కోబాకమిట్టకు చెందిన స్వాతిపై అదే కాలనీకి చెందిన గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగయ్య, హరి, జ్యోతి దాడిచేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

కండలేరులో 8.594 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 8.594 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 500 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 115, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.